క్లుప్తంగా

అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయలో ఇంటర్మీడియేట్ వరకు దాదాపు 850 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇప్పటికి ఆరు బస్సులు నడుపుతున్నారని, అదనంగా మరో రెండు బస్సులు నడపాలని కేవీకే పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర కోరారు. ఈ మేరకు ఆయన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఈ విషయంగా విన్నవించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు చంద్రగిరి నారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీవీ పట్టాభిరామ్ మృతి తీరనిలోటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకియాట్రిస్ట్ బీవీ పట్టాభిరామ్ మరణించారన్న వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు డాక్టర్ జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎందరో యువకులను సన్మార్గంలోకి మళ్లించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమన్నారు. గతంలో పలు సందర్భాలలో కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని వారు సందర్శించి, తాను రచించిన పలు పుస్తకాలను అందజేశారన్నారు. తెలుగు వారు ఒక గొప్ప వ్యక్తిత్వ నిపుణుడిని, రచయితను కోల్పోవడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారికుటుంబ సభ్యులకు భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నామన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: హైదరాబాద్ సమీపంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ యూనిట్లో జరిగిన భారీ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఎస్.డి విజయ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని, ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లింపులతో పాటు బాధ్యత వహించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ స్థలాల ఆక్రమణ అరికట్టాలి

కడప రూరల్: వక్ఫ్ స్థలాలను ఆక్రమిస్తున్నారని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని పలు ప్రాంతాల్లో విలువైన వక్ఫ్ స్థలాలు ఆక్రమణకు గురి అవుతున్నాయని ఆరోపించారు. న్యాయస్థానాల ఆదేశాలను సైతం ధిక్కరించి ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ ఆస్తుల పరిరక్షణలో పూర్తిగా వైఫల్యం చెందిందని తెలిపారు. ఖరీదైన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కార్మిక సమ్మె జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల కార్యచరణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంఘిక విధానాలు దేశ ప్రజలను, పేదలను పీడించేవిగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కెసీ బాదుల్లా, ఓబయ్య, డబ్ల్యూ.రాము, సుబ్బరాయుడు, జయవర్ధన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్య బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేద వర్గాలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫాతిమా మెడికల్ కళాశాల సెక్రటరీ ఏక్యూ జవ్వాద్, ఈడీ సల్మాన్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం వల్లూరు బస్టాండు సమీపంలోని గణేష్‌పురం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ప్రీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, కంటి సమస్యలకు సంబంధించిన వారికి వైద్యసేవలు అందించారు. 150 మందికి పైగా వైద్య సేవలు పొందారు.

మెరుగైన ఆరోగ్య సమాజమే వైద్యుల ధ్యేయం

కడప రూరల్: మెరుగైన ఆరోగ్య సమాజమే వైద్యులు, వైద్య సిబ్బంది ధ్యేయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, అన్నమయ్య జిల్లా డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ అన్నారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఉద్యోగులు మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు, వైద్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న వారు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఇకపై హెల్త్ ఎడ్యుకేటర్స్‌ను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పిలవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు నాగశశిభూషణరెడ్డి, రవిబాబు, రమేష్, ప్రీతి, వైద్య సిబ్బంది ఖాజామెహిద్దీన్, భారతి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

కడప సెవెన్‌రోడ్స్ : రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ కడప చాప్టర్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానించారు. సీనియర్ వైద్యులు పుత్తా బాలిరెడ్డి, అశోక్ కుమార్, నిర్మల, జగదీశ్వర్‌రెడ్డి, వారణాసి ప్రతాప్ రెడ్డి, కృష్ణకిశోర్‌రెడ్డి, హోమియో వైద్యులు ఆర్.రంగనాథరెడ్డి, శ్రీనివాసులు, కార్డియాలజిస్టు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, భృంగి మహేష్, సైకాలజిస్టు ఓవీ రెడ్డి, ఫిజియోథెరపిస్టు అమీర్‌బాషలను సత్కరించారు.



డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ లో..

కడప అర్బన్: కడప నగర శివార్లోని రిమ్స్ ఆవరణంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రపంచ వైద్యుల దినోత్సవం ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ శ్రీదీప్, డాక్టర్ మనోజ్‌కుమార్ రెడ్డి, సుకుమార్, వైద్య సిబ్బంది , నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రం ఇస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున

– కడప ప్రభుత్వ వైద్యశాల (రిమ్స్) లో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.జమున విచ్చేశారు. రక్తదాన శిబిరంలో డాక్టర్లు వైద్య విద్యార్థులు మొత్తం 115 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సి ఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ వై శ్రీనివాసులు, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ రాజేశ్వరి, పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ శోభారాణి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, జి డి ఏ ఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ ఫరూక్, జీడిఏ ఏపీ సెక్రటరీ డాక్టర్ సిబిఎస్ రాముడు, డాక్టర్ స్వామిదాసు, ఏపీ జూడ ప్రెసిడెంట్ డాక్టర్ విష్ణు, ఏపీ జూడ సెక్రటరీ డాక్టర్ నిఖిల్, అసోసియేషన్ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సత్కరిస్తున్న ఇంటాక్ సంస్థ ప్రతినిధులు

– రిమ్స్ ఆవరణలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ (ఐఎంహెచ్)లో డాక్టర్స్ డే ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకట్రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎంహెచ్‌లో విశిష్ట సేవలందించిన డాక్టర్స్ కి సన్మానం చేశామన్నారు.

రక్తదానం శిబిరం

కడప అగ్రికల్చర్: కడపలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీ బ్యాంకు) ప్రధాన కార్యాలయంలో మంగళవారం బ్యాంకు చైర్మన్ ఎం. సూర్య నారాయణ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించారు. అనంతరం బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప రెడ్ క్రాస్ సంస్థ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 36 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నారాయణరెడ్డి చైర్మన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ రాజామణి, డీజీఎం ప్రతాపరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కడప రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

కడప అర్బన్: కడపలోని రిమ్స్ ఆవరణంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్య బృందం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. వేముల మండలం తుమ్మలపల్లికి చెందిన రామాంజనేయులు(37)కు ఇటీవల అరుదైన, హార్మోన్ స్రవించే గ్రంథి వ్యాధి అయిన ఫియోక్రోమోసైటోమా వ్యాధిని గుర్తించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధి సగటున ప్రతి 10 లక్షల మందిలో ఐదుగురిలో మాత్రమే కనిపిస్తుందని డాక్టర్ల బృందం తెలియజేశారు. వైద్య పరీక్షల ద్వారా అతని కుడి వైపు అడ్రినల్ గ్రంథిలో (కుడి మూత్ర పిండం పైభాగాన) సుమారు 10-12 సెం.మీ పరిమాణంలో ట్యూమర్ (కణితి) ఉన్నట్టు నిర్ధారణ అయింది. శస్త్ర చికిత్సకు ముందు ఎండోక్రైనాలజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మనోజ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో రోగి బీపీ పూర్తిగా నియంత్రించి.. ఆ తర్వాత అనుభవజ్ఞులైన యూరాలజీ కు చెందిన డాక్టర్ రాజా రెడ్డి (అసోసియేట్ ప్రొఫెసర్), డాక్టర్ శ్రీదీప్ సిద్దవరం (అసిస్టెంట్ ప్రొఫెసర్) నేతత్వంలో అనస్తీషియా విభాగానికి చెందిన ప్రొఫెసర్, విభాగాధిపతి డా. సునీల్ చిరువెళ్ల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ సమన్వయంతో ఓపెన్ అడ్రినలెక్టమీ విజయవంతంగా నిర్వహించారు.



ఆపరేషన్ చేయించుకున్న రోగి రామాంజనేయులును పలుకరిస్తున్న రిమ్స్ అధికారులు



రోగి నుంచి తొలగించిన కణతి (ట్యూమర్)

రైల్వే చార్జీలను ఉపసంహరించాలి



స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి పెంచిన రైల్వే చార్జీలను రద్దు చేయడంతోపాటు రైళ్లలో అదనపు బోగీల ఏర్పాటు, పరిశుభ్రత పై దృష్టి పెట్టాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు సీపీఎం బృందం కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, తిమ్మయ్యలు పాల్గొన్నారు.

పుస్తకాలు బహూకరణ

కడప ఎడ్యుకేషన్: సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి పలువురు పుస్తకాలు వితరణ చేశారు. హైదరాబాదు నగరానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్ కందా , గతంలో కడప కలెక్టర్‌గా పనిచేసిన దివంగత డా.పి.ఎల్.సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ తెలుగు రీడర్ డా.సిహెచ్. శివరామకృష్ణ శర్మ, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి మంగళవారం తమ నివాస గృహాల్లో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరి భూషణ రావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, బి.హరి కృష్ణలకు మొత్తం 700 పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన అమూల్యమైన గ్రంథాలు విలువైనవన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.



పుస్తకాలను అంద చేస్తున్న మోహన్‌కందా

సరుకులు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో వృద్ధులకు సేవ చేయడం అభినందనీయమని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏజీఎం జి.రవికుమార్ తెలిపారు. మంగళవారం బృంద వృద్ధాశ్రమంలో స్టేట్ బ్యాంకు 70వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కడప నగరంలోని బృంద వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ ఇంగ్లీషులో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: ఏపీ పీజీ సెట్ ఇంగ్లీష్‌లో కడపకు చెందిన షేక్ రుక్సార్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఈమె కడపలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకుంది. విద్యార్థిని షేక్ రుక్సార్ ఇటీవల ఏపీ గవర్నమెంట్ నిర్వహించిన ఏపీపీజీ సెట్ ఇంగ్లీషులో ఫస్ట్ ర్యాంక్‌ను సాధించి తన తల్లిదండ్రులకు తాను చదివిన కాలేజీకి మంచి పేరు ప్రతిష్టలు గడిచింది. మంగళవారం కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి సలీం బాషా, ఇతర అధ్యాపక బృందం విద్యార్థి షేక్ రుక్సార్‌ను అభినందించారు.



షేక్ రుక్సార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఏఆర్ మూర్తి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కడప రీజినల్ కార్యదర్శి ఏఆర్ మూర్తి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వద్ద పదోన్నతుల ఫైలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ స్వంతంగా ప్రభుత్వ సహాయ సహకారాలతో కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పెండింగ్ డీఏ బకాయిలను, 11వ పీఆర్సీ అరియర్స్‌ను, 24 నెలల పెండింగ్ బకాయిలను ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 4, 5 తేదీలలో డిపో ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాయపాటి సుబ్రమణ్యం, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రఘురామ్‌గౌడ్, బాల వెంకటేశులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉరి తాళ్లతో నిరసన

కడప కార్పొరేషన్ / కడప సెవెన్ రోడ్స్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడురోడ్ల కూడలిలో ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి మాట్లాడుతూ జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు రూ.24500 వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు దాదాపు 13000 వేల మంది వున్నారని, స్ట్రీట్ లైటింగ్, వాటర్ వర్క్స్, హార్టీకల్చర్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో పనిచేస్తున్నారని, కొందరు డ్రైవర్లుగా సేవలందిస్తున్నారన్నారు. యోగా పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్న కూటమి ప్రభుత్వం, కార్మికుల వేతనాలు పెంచడానికి మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. విశాఖపట్నంలో ప్రైవేటు సంస్థలకు భూములు అప్పగించడానికి అత్యవసరంగా సమావేశమయ్యే మంత్రివర్గం, కార్మికుల సమస్యలను మాత్రం చర్చించడం లేదన్నారు. ఆప్కాస్‌లో గవర్నమెంట్ ఉద్యోగి అని తొలగించి, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్. సహాయ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, సుబ్బారాయుడు, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏడురోడ్ల కూడలిలో ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఎల్ఐసీ సంరక్షణకు రాజీలేని పోరాటం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వరంగంలోని ఎల్ఐసీని సంరక్షించుకోవడానికి రాజీలేని పోరాటాలు చేస్తామని ఎల్ఐసీ యూనియన్ కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. ఆ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం యూనియన్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ పతాకావిష్కరణ చేశారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ మోసకారి ప్రైవేటు బీమా సంస్థలకు వ్యతిరేకంగా తమ సంఘం 1951 నుంచి ఐదేళ్లపాటు పోరాడిందన్నారు. ఆ తర్వాతే జాతీయకరణ జరిగి ఎల్ఐసీ ఏర్పాటైందని గుర్తు చేశారు. తాము ఎల్ఐసీని, తమ సంఘాన్ని రెండు కళ్లుగా భావిస్తామన్నారు. ఖాతాదారులకు కార్యాలయంలో బాధ్యతతో సేవలు అందిస్తామన్నారు. బయట పౌరులతో కలిసి సంస్థను కాపాడుకునేందుకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్టీ తొలగించాలని కోరారు. ఎల్ఐసీ పొదుపు మొత్తాలకు పాలసీదారులకు ప్రత్యేక ఆదాయ పన్ను రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐ ఆలోచన, బీమా చట్టాల సవరణ బిల్లు ఆలోచనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 9వ తేదీ దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన సీనియర్లు, కడప డివిజన్ వ్యవస్థాపక నాయకులు ఖాదర్‌బాష, శంకర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఆర్ఎస్ బాబు, గంగయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధీకర్, అక్బర్‌బాష, వసుప్రద, అయ్యవారురెడ్డి, వారిజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ ఆందోళనలో నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు రూ.12వేల వేతనంతో తమ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ని ధర్నాలు చేసినా, వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం గానీ ఇతర సంక్షేమ పథకాలుగానీ వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. ఆప్కాస్ ఆన్‌లైన్‌లో కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా చూపుతూ సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి ఎస్. కిరణ్, వి. శ్రీధర్, నాగరాజు, సాయి, హరిక్రిష్ణ, హజరత్, కొండయ్య, కాటమయ్య, శివ, ఆదాము, సాయమ్మ, పెంచలమ్మ, రమణ పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గత పదేళ్లుగా బద్వేలు డిపోలో విధులు నిర్వర్తిస్తున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని అద్దె బస్సు, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు కోరారు. మంగళవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి రాతమూలకంగా తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం బద్వేలు డిపో మేనేజర్ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. 25 కిలోమీటర్ల ఐడెంటిటి కార్డులను కూడా తమ వద్ద నుంచి తీసుకున్నారని తెలిపారు. మరోవైపు ఆర్టీసీ బస్సులకు డ్యూటీకి వెళితే కేఎంపీఎల్‌పై వేధింపులు, చిన్నచిన్న డ్యామేజీలకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. రోజువారి వేతనం తక్కువగా ఇస్తున్నారని, ఇందుకు తామేచ్చేది ఇంతేనని, మీ ఇష్టమని బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారన్నారు. అలాగే బద్వేలు డిపోలో ఓ అధికారి తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా తమకు న్యాయం చేయాలని కోరారు.

అన్నదానం



రిమ్స్‌లో భోజనం కోసం క్యూలో ప్రజలు

కడప ఎడ్యుకేషన్ / కడప కోటిరెడ్డి సర్కిల్: కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల శివానంద రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి గత సంవత్సరం నవంబర్ నుంచి రిమ్స్‌లో అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి మంగళ, శుక్రవారంలో ఈ అన్నదాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ వారం సుమారుగా 1000 భోజన పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

రికార్డుల నిర్వహణపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎస్ఆర్సీ పరిధిలోని ఏడు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు, బోధనేతర సిబ్బందికి పరిపాలన సంబంధిత రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆర్జేడీ డాక్టర్ డి.నాగలింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోగ్రాంలో రిసోర్స్ పర్సన్స్‌గా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయ్ కుమార్, ఆర్‌జేడీ కార్యాలయం సూపరింటెండెంట్ శివ ఆంజనేయులు పాల్గొని అనేక సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కడప, ఎర్రగుంట్ల, మైదుకూరు, పెండ్లిమర్రి, వేంపల్లి, పోరుమామిళ్ల , పులివెందుల మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటికీ ఇంతవరకు డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ ఉన్నత విద్యా మండలి విడుదల చేయలేదని తక్షణమే విడుదల చేసేటట్లు చర్యలు చేపట్టాలని పిడియస్ యు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని పిడియస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్ రెగ్యులర్ ఫలితాలు విడుదలై రెండున్నర నెల పూర్తి అవడంతోపాటు సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసి నెలకావస్తున్నా ఇంతవరకు ఉన్నత విద్యా మండలి అధికారులు డిగ్రీ అడ్మిషన్ల నోటికేషన్ విడుదల చేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా మే, జూన్ లో ప్రక్రియ ప్రారంభించి జూలై మొదటి వారంలో తరగతులు ప్రారంభించే వారన్నారు.